డీజిల్ తాగేస్తున్నారు!



- వాహనాలు తిరగకున్నా ఖర్చుల్లో లెక్కలు
- కార్పొరేషన్ శానిటేషన్ విభాగంలో అక్రమాలు
- మెమోలు ఇచ్చినా మారని తీరు
- పర్యవేక్షణ చేయని అధికారులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డీజిల్ ఖర్చులు అమాంతం పెరిగి పోతున్నాయి. శానిటేషన్ విభాగంలో వాహనాలు తిరగకున్నా డీజిల్‌కు ఖర్చు అయినట్లు లెక్కల్లో రాస్తున్నారు. అసలే జీతాలు ఇవ్వడానికి మున్సిపల్ అధికారులు నానా తంటాలు పడుతుంటే ఇప్పుడు డీజిల్ ఖర్చులతో తలలు పట్టుకుంటున్నారు. గతంలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా వ్యవహరించిన చిత్రామిశ్రా శానిటేషన్‌పై ప్రత్యేక నిఘా పెట్టారు. అక్రమాలు జరుగుతున్న విషయాన్ని గుర్తించి ప్రత్యేకాధికారులతో తనిఖీలు చేయించారు. దీంతో రూ.పది లక్షల మేర ఒక్క నెలలో ఆదా అయ్యాయి. మళ్లీ ఇప్పుడు డీజిల్ ఖర్చులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

కమిషనర్ మారగానే..

నిజామాబాద్ నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగం అంతా అస్తవ్యస్తంగా మారింది. శానిటేషన్ విభాగంలో వాహనాలను వాడకున్నా డీజిల్ ఖర్చులు చూపించిన్నట్లు గతంలో ప్రత్యేక అధికారుల తనిఖీల్లో గుర్తించారు. నగరంలో ఆరు జోన్ కార్యాలయాలు నాందేవాడ, గోల్‌హనుమాన్, పెద్ద బజార్, రాజీవ్‌గాంధీ ఆడిటోరియం, కంఠేశ్వర్, అర్సపల్లిలో ఉన్నాయి. ఒక్కో జోన్‌లో 15 మినీ టాటా ఏసీ వాహనాలు, రెండు ట్రాక్టర్లు, స్వీపింగ్ మిషన్లు ఉన్నాయి. ఒక్కో జోన్‌లో 200 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఒక్కో వాహనానికి ప్రతినిత్యం 12లీటర్ల డీజిల్ ఖర్చు అవుతుందని శానిటేషన్ అధికారులు లెక్కలు చెప్పారు. ఆ మేరకు చెత్త సేకరణ జరగడం లేదని గతంలోనే వెల్లడించారు. ప్రస్తుతం ఆరు నుంచి ఏడు లీటర్ల డీజిల్ ఖర్చు అవుతోందని చెబుతున్నారు. అయితే అప్పుడు 12 లీటర్లు ఖర్చు అయినప్పుడు ఎంత వ్యయం చూపెట్టారో ఇప్పుడు అంతే చూపడం గమనార్హం. ఓ ఇన్‌చార్జి అధికారికి ముడుపులు ఇవ్వడంతో డీజిల్ ఖర్చులపై తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేక అధికారులు తనిఖీ చేసి ఆయా జోన్‌లలో అక్రమాలపై నివేదికను ఇన్‌చార్జి కమిషనర్ చిత్రామిశ్రాకు అందజేశారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక్కో వాహనానికి ఆరు నుంచి తొమ్మిది లీటర్లలోపు డీజిల్ ఖర్చు చేయాలని ఎంహెచ్‌వో ఆదేశాలు ఇచ్చారు. అయినా మళ్లీ కథ మొదటికి వచ్చింది. ఇన్‌చార్జి కమిషనర్ కాస్త పూర్తి స్థాయి కమిషనర్‌గా మంద మకరందు జూలైలో వచ్చారు. రెండు, మూడు నెలల నుంచి డీజిల్ ఖర్చులు పొంతన లేకుండా పోయాయి. వాహనాలు వాడకున్నా వాడుతున్న డీజిల్ ఖర్చులు అమాంతం పెంచేస్తున్నారు.

ఒక్క నెలలో రూ.10 లక్షలు ఆదా

ఇన్‌చార్జి కమిషనర్‌గా చిత్రామిశ్రా శానిటేషన్‌పై నిఘాపెట్టి కట్టడి చేశారు. డీజిల్ అక్రమాలపై నిగ్గు తేల్చారు. శానిటేషన్ అధికారులపై మండిపడ్డారు. దీంతో డీజిల్ లెక్కలు అదుపులోకి వచ్చాయి. 'సాక్షి'లో వరుస కథనాలు రావడంతో ఫిబ్రవరి నుంచి మార్చి వరకు ఒక్క నెలలో రూ.పది లక్షల వరకు ఆదా అయ్యాయి. ఈ లెక్కాన ప్రతి నెల డీజిల్‌ను ఆదా చేయాల్సిన అధికారులు కమిషనర్ మారిపోగానే కథ మళ్లీ మొదటికి వచ్చింది.

పట్టించుకోని అధికారులు

శానిటేషన్‌పై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. మున్సిపల్‌కు పూర్తిస్థాయి కమిషనర్ రావడంతో శానిటేషన్ గాడిలో పడుతుందని అనుకున్నారు. కమిషనర్‌కు వచ్చీరాగానే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా, ఎన్నికలు ఉండడంతో బిజిబిజీగా గడిపారు. దీంతో ఆయన దృష్టి పెట్టకపోవడంతో శానిటేషన్‌లో పాలన గాడి తప్పుతుందని అందరు చర్చించుకుంటున్నారు. దీనిపై ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిద్ అలీని వివరణ కోరగా తక్కువగా డీజిల్ వాడుతున్నామని చెప్పారు.

జీడీఎస్‌ల నిరవధిక సమ్మె



నిజామాబాద్‌లో సమ్మె చేస్తున్న జీడీఎస్‌లు

నిలిచిన ఉత్తరాల బట్వాడా

నిజామాబాద్ సిటీ: గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్)లు తమ డిమాండ్ల సాధనకు చేపట్టిన నిరవధిక సమ్మెతో ఉత్తరాల బట్వాడా నిలిచిపోయింది. ఈ నెల 12 నుంచి జీడీఎస్‌లు విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెలో పాల్గొనటంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేరవలసిన ఉత్తరాలు, పార్సిళ్లు సబ్ పోస్టాఫీస్ కార్యాలయాలల్లో పేరుకుపోతున్నాయి. వాస్తవానికి జీడీఎస్‌లు నాలుగు గంటలపాటు పని చేయవలసి ఉండగా, 7 నుంచి 8 గంటల వరకు తమతో పని చేయించుకుంటున్నారని వాపోతున్నారు. అందుకే తమకు రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చినట్లు వెయిటేజీ, ఇంక్రిమెంట్స్, సీనియర్ బంచింగ్‌లు ఇవ్వాలని, 12, 24, 36 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారికి ఆర్థిక ఉన్నతి కల్పించాలని కోరుతున్నారు.

జిల్లాలో మొత్తం 415 బ్రాంచ్ పోస్టాఫీస్‌లు ఉండగా, వీటిలో 750 మంది గ్రామీణ డాక్ సేవక్‌లు పనిచేస్తున్నారు. వీరిని పార్టుటైం ఉద్యోగులుగా తీసుకుని పూర్తిస్థాయిలో పనులు చేయిస్తున్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న జీతం రూ.10 నుంచి రూ.12 వేలు, టీఏ, డీఏలు కలుపుకుని మొత్తం రూ. 16 నుంచి 18వేల వరకు అందుతోంది. 8 గంటలు పని కల్పించి అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

నాలుగో రోజుకు చేరిన సమ్మె

జీడీఎస్‌ల నిరవధిక సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. జీడీఎస్ నిజామాబాద్ డివిజన్ అధ్యక్షుడు గంగారాం ఆధ్వర్యంలో హెడ్ పోస్టాఫీస్ ఎదుట జీడీఎస్‌లు సమ్మె చేస్తున్నారు. ఈ సమ్మెలో డివిజన్ కార్యదర్శి యేగేశ్వర్, జీడీఎస్‌లు గంగాధర్, నర్సయ్య, అశోక్, అల్లర్ రాజు, అయూబ్, ఖలీల్, కార్తీక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఖలీల్‌వాడి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఫాసిస్ట్ విధానాలను శరవేగంగా అమలు చేస్తుందని, ఈ విధానాలపై యువత ఉద్యమించాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం పీవైఎల్ జిల్లా కమిటీ సమావేశం నగరంలోని కోటగల్లిలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో జరిగింది. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల పాలించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దివాళ తీయిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని లేకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడ కోల్పోతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం, శ్రీనివాస్, నర్సయ్య, సాయినాథ్, భాస్కర్, దాసు, సాయిలు, రాజు, సంజీవ్ తదితరులున్నారు.

విద్యార్థులపై ఒత్తిడి పెంచొద్దు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్: విద్యార్థులపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఒత్తిడి పెంచకుండా చదివించాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం నగరంలోని నలంద స్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులను ఒత్తిడికి గురి చేయొద్దన్నారు. వారి నైపుణ్యాన్ని గుర్తించి ఆయా రంగాల్లో ప్రోత్సహించాలన్నారు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, పాఠశాల డైరెక్టర్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడాపహడ్ మీదుగా కామారెడ్డికి బస్సు నడపాలి

రుద్రూర్: బోధన్ నుంచి వర్ని, బడాపహడ్ మీదుగా కామారెడ్డి జిల్లా కేంద్రానికి బస్సులు నడుపాలని ప్రజలు కోరుతున్నారు. రుద్రూర్, వర్ని మండలాల నుంచి కామారెడ్డి వెళ్లడానికి బాన్సువాడ పట్టణానికి వెళ్లి మరో బస్సు మరాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,900	వెండి (కిలో)	77,200
22 క్యారెట్స్	57,997		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	190	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	25	గాజరుగడ్డ	40	60
బెండకాయ	50	80	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	60	80	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	16	35
జిర్కినుకాయ	50	80	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	15	30
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	40	60	కరివేపాకు	60	80
మెంతికూర	40	60	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	60	80
పుదీనా	50	80	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-2: యానిమల్(తెలుగు)-12.00; యానిమల్ (హిందీ)-3.45, 10.30; పిండం(తెలుగు) 7.30
- స్క్రీన్-3: పిండం(తెలుగు) 10.30, 4.30; పిండం(తెలుగు)-4.30; హాయ్ నాన్న- 1.30, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: యానిమల్(తెలుగు)-11.05, 6.20; హాయ్ నాన్న(తెలుగు)-3.05, 10.20
- స్క్రీన్-2: యానిమల్(హిందీ)-10.00,6.00, 10.00; యానిమల్(తెలుగు)-2.00
- స్క్రీన్-3: తికమకతండ(తెలుగు)-1.10; సామ్ బహదూర్ (ఇంగ్లీష్)- 3.40; ఎక్ట్రా ఆర్డినరీ మెన్(తెలుగు)-6.50; పిండం(తెలుగు)-10.10
- స్క్రీన్-4: లాంగ్‌లైవ్(తెలుగు)-11.05; శాంతల(తెలుగు)-1.55; జోరుగా హుషారుగా (తెలుగు)- 4.20; కలశ (తెలుగు)-10.30

- దేవి: హాయ్ నాన్న(తెలుగు)
- నటరాజ్: యానిమల్(హిందీ)
- లలితామహల్: యానిమల్(తెలుగు)
- విజయ్: ఎక్ట్రా ఆర్డినరీ మెన్(తెలుగు)

క్లుప్తంగా

కు.ని. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కమ్మర్‌పల్లి: మోర్తాడ్ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఈనెల 21న పురుషుల కోసం నిర్వహించే కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరసింహస్వామి పేర్కొన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. దోమల బెడదను నివారించేందుకు ఫ్రై డే డ్రై డేగా నిర్వహించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జీపీ కార్యదర్శి శాంతికుమార్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులో ఆదర్శం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మంథని గ్రామానికి చెందిన రైతులు ఒకే రోజులో వ్యవసాయ విద్యుత్ బిల్లులు చెల్లించి ఆదర్శంగా నిలిచారు. గ్రామంలోని 640 వ్యవసాయ మోటార్లకు సంబంధించిన రూ.2,32,200 విద్యుత్ బిల్లులను శుక్రవారం చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణ్ కుమార్, లైన్‌మెన్లు సల్ల శ్రీనివాస్ యాదవ్, కుమార స్వామి, జేఎల్ఎం లింబాద్రి, రమేష్, దినేష్, రైతులు హోండా సర్పా రెడ్డి,నర్సయ్య పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ సరికాదు



కమ్మర్‌పల్లి: వేల్పూర్ మండల కేంద్రంలో ముస్లింలపై గ్రామాభివృద్ధి సాంఘిక బహిష్కరణ విధించడం సరికాదని కమ్మర్‌పల్లి ముస్లిం కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం మండల కేంద్రంలోని ముస్లిం కమిటీ సభ్యులు సమావేశమై వేల్పూర్‌లో బహిష్కరణ విధించడాన్ని ఖండించారు. ఈద్గా స్థలానికి సంబంధించి పహానీ, రెవెన్యూ, వక్ఫ్ రికార్డులు అన్ని సక్రమంగా ఉన్నప్పటికీ గ్రామాభివృద్ధి కమిటీ దౌర్జన్యంగా సాంఘిక బహిష్కరణ విధించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. జిల్లా అధికార యంత్రాంగం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఆదిమల్లన్న జాతర



వేల్పూర్: వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో శనివారం నుంచి ఆది మల్లన్న జాతర ఉత్సవాలు జరుగుతాయని వీడీసీ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు వారు శుక్రవారం జాతర ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. శనివారం గ్రామంలో ఆదిమల్లన్న శోభాయాత్ర, ఆదివారం గంగస్నానము, సోమవారం గ్రామం నుంచి ఆదిమల్లన్న గుట్టకు రథాన్ని తీసుకెళ్లడం, మంగళవారం జాతర, రథోత్సవం, బుధవారం నైవేద్యాలు సమర్పించుకోవడం, ఆదేరోజు రాత్రి నాగవెల్లి, అగ్నిగుండం, గుట్టచుట్టూ శోభాయాత్ర నిర్వహించడం కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

వర్సిటీలో నూతన హాస్టళ్లు నిర్మించాలి



మాట్లాడుతున్న తెయూ పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి జయంతి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌లో బాలికలకు, పీహెచ్‌డీ స్కాలర్స్‌కు ఒక్కో హాస్టల్, సారంగపూర్ ఎడ్యుకేషన్ క్యాంపస్‌లో బీఈడీ విద్యార్థులకు ఒక హాస్టల్‌ను వెంటనే నిర్మించాలని వర్సిటీ పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి జయంతి డిమాండ్ చేశారు. శుక్రవారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెయూలో బాలికలకు ఒకే హాస్టల్ ఉండటంతో సుమారు 500 మంది విద్యార్థినులకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ఒక్కో రూంలో 8– 10 మంది విద్యార్థినులు ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీహెచ్‌డీ స్కాలర్స్‌కు కూడా హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సారంగపూర్ బీఈడీ కాలేజ్‌లో సీట్లు వచ్చిన కొందరు గ్రామీణ ప్రాంత విద్యార్థులు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో తమ అడ్మిషన్స్ రద్దు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి బాలికలు, స్కాలర్స్, బీఈడీ విద్యార్థుల కోసం కొత్త హాస్టల్స్‌ను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్స్, దేవి క, ఆకాష్, అక్షయ్, మోహిత్, హన్మాండ్లు, లహరి పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

నిజామాబాద్‌నాగారం: నగరంలో వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తికి పోలీసుల అనుమతితో శుక్రవారం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, ఈసీ మెంబర్ కాసుల సాయితేజ, చందా జగన్ మోహన్, జయదేవ్, పురుషోత్తం, 4వ ఠాణా పోలీస్ సిబ్బంది నాగేంద్ర పాల్గొన్నారు.

బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్ట్ నిరుద్యోగులకు ఇవ్వాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ సారంగపూర్ బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టును అర్హత గల నిరుద్యోగులకు ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె రాజేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టుకు యూనివర్సిటీ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా నోటిఫికేషన్ విడుదల చేయడం, అందులో పదవీ విరమణ పొందిన వారికే మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలుపడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని, వారిని కాదని రిటైర్మెంట్ అయిపోయిన వారికి అవకాశాలు ఇవ్వడం ఏంటని విమర్శించారు. డిసెంబర్ 8న నోటిఫికేషన్ విడుదల చేశారని అందులో రెండు రోజులు సెలవులే వచ్చాయన్నారు. దరఖాస్తుకు కేవలం నాలుగు రోజులు మాత్రమే అవకాశం ఇచ్చారని గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు.

ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం



సుభాష్‌నగర్: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును టీఎన్‌జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అధ్యక్షతన జిల్లా నాయకులు హైదరాబాద్‌లోని కొత్త సచివాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై చర్చించగా, ఆయన సానుకూలంగా స్పందించారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, కస్తూరి వెంకటేశ్వర్లు, రామినేని శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



మాట్లాడుతున్న ఎంపీడీవో లింగం

మోపాల్: గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం నుంచి ఈనెల 30వరకు మండలంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లింగం నాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్, మొక్కలు పెంచేందుకు అవసరమైన విత్తనాలు సమకూర్చుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలను పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంపీవో మహ్మద్ ఇక్బాల్ అహ్మద్, ఏపీవో సునీత, ఈసీ సాగర్ పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నిజామాబాద్‌అర్బన్: కాకతీయ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. సుగుణ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రామోజీరావు హాజరై మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ సెల్వకుమార్‌రాజా,వైస్ ప్రిన్సిపాల్ సాయారెడ్డి పాల్గొన్నారు.

సర్దార్ పటేల్‌కు ఘన నివాళి



జెడ్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

నిజామాబాద్‌నాగారం: దేశ తొలి ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు,బీఆర్‌ఎస్ నాయకులు నీలంరెడ్డి, శేఖర్ రాజు పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండలోని కిడ్స్‌పార్క్ పాఠశాల, సత్యశోధక్ పాఠశాలల్లో సర్దార్ వల్లాబాయి పటేల్ వర్ధంతిని నిర్వహించారు. పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సిరికొండలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మండల సమావేశానికి సర్పంచ్‌ల డుమ్మా



సిరికొండ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగీత అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశానికి సర్పంచ్‌లు డుమ్మా కొట్టారు. మండలంలో 30 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం కొండూర్, సిరికొండ, హుస్సేన్‌నగర్, న్యావనంది, గడ్కోల్ గ్రామ సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మండల సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చి చర్చించాల్సిన సర్పంచ్‌లే డుమ్మా కొట్టడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సిరికొండ, గడ్కోల్, కొండూర్, పెద్దవాల్గోట్, మైలారం ఎంపీటీసీలు హాజరైనప్పటికి ఎలాంటి సమస్యలను ప్రస్తావించలేదు. అధికారులు నివేదికలు చదివి వినిపించారు. సమావేశం సాదాసీదాగా ముగిసింది. వైస్ ఎంపీపీ రాజన్న, తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, ఏఈలు పాల్గొన్నారు.